



» అటవీశాఖ అనుమతులు లేక జిల్లాలో 13 పల్లెలకు అందని విద్యుత్ సౌకర్యం » కాంగ్రెస్ సర్కారైనా సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

నిర్మల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అనేక మారుమూల గిరిజన పల్లెలకు గత 50 ఏళ్ల నుంచి కరెంటు సౌకర్యం అందడం లేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తమ గ్రామాలకు కరెంటు సౌకర్యం వస్తుందని గిరిజనులు ఆశపడ్డారు. అయితే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పల్లెలకు కరెంటు సౌకర్యం అందించే విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా జిల్లాలోని పెంబి, కడెం మండలాల్లోని 16 గ్రామాలు కరెంటు సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నాయి. కాగా ఇందులో నుంచి మూడు గ్రామాలకు ఇప్పటివరకు సింగల్‌ఫేస్ కరెంటు సౌకర్యం కూడా లేక పోవడంతో ఆ గ్రామాలన్నీ అంధకారణంలోనే మగ్గుతున్నాయి. మరో 13 గ్రామాల గిరిజనులు మాత్రం త్రీఫేస్ కరెంటు సౌకర్యం కోసం అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎన్నికల సమయంలో నేతలంతా ఈ గ్రామాలకు వెళ్లి కరెంటు సౌకర్యం కల్పిస్తామంటూ హామీల వర్షం కురిపించడం రివాజుగా మారింది. ఎన్నికల తర్వాత ఈ పల్లెల వైపు ఏ ఒక్క నేత కూడా కన్నెత్తి చూడడం లేదంటున్నారు. అయితే విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటికే చాలాసార్లు మూడు గ్రామాలకు సింగల్‌ఫేస్ కరెంటు, మరో 13 గ్రామాలకు త్రీ ఫేస్ కరెంటు సౌకర్యం కల్పించేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. దీనికి సంబంధించి అటవీశాఖ అనుమతి తప్పనిసరి కావడంతో విద్యుత్‌శాఖ అధికారులు ఈ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించే విషయంలో వెనుకడుగు వేయాల్సి వస్తోంది. అప్పటి ప్రభుత్వం అటవీ శాఖ ద్వారా అనుమతులు సాధించడంలో పూర్తిగా విఫలమైందన్న ఆరోపణలున్నాయి. గ్రామాలన్నీ కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉన్నందున ఇక్కడ అటవీశాఖ అనుమతులు సాధించడం కష్టతరంగా మారింది.

కరెంటు కోసం ఏళ్ల నుంచి ఎదురుచూపులు

కరెంటు కోసం మొత్తం 16 గ్రామాలు ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాయి. ఇందులో నుంచి మూడు గ్రామాలు అసలే కరెంటే సౌకర్యానికి నోచుకోక తల్లడిల్లుతుండగా మరో 13 గ్రామాలు త్రీ ఫేస్ కరెంటు సౌకర్యం కల్పించాలంటూ డిమాండ్ చేస్తున్నాయి. పెంబి మండలంలోని పోచంపల్లి (సోముగూడ), పెదరాగి దుబ్బ, గోధుమల గ్రామాలకు ఇప్పటి వరకు సింగల్‌ఫేస్ కరెంటు సౌకర్యం కూడా లేదు. అలాగే ఇదే మండలంలోని జీడిమల్లి తండా, గోరి పెద్దయ్య గూడెం, కోరికంటి, ఊసగుట్ట, రాగి గూడ, జంగుగూడ, సాకిగూడ, రామగూడ, కొత్తగూడ, ఇస్లాంపూర్, కడెం మండలంలోని గండి గోపాల్‌పూర్, ఇస్లాంపూర్, మీది చింత గ్రామాలు త్రీఫేస్ కరెంటు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నాయి.

ఆటంకం అవుతున్న అటవీశాఖ అనుమతులు

పెంబి, కడెం మండలాల్లోని 16 గిరిజన గ్రామాలు కవ్వాల్ అభయారణ్యం పరిధిలోకి వస్తుండడంతో ఆ గ్రామాలకు కరెంటు సౌకర్యం అందించలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించాలంటే అటవీశాఖ అనుమతులు తప్పనిసరి. అయితే తమకు ఎక్కడైనా ఓ చోట 23 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తే ప్రత్యామ్నాయంగా తాము అనుమతులు జారీ చేస్తామంటూ గతంలో అటవీశాఖ షరతులు విధించింది. ఈ షరతులపై స్పందించిన విద్యుత్ అధికారులు అప్పటి కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకుపోగా భైంసా ప్రాంతంలో అటవీ శాఖకు 23 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కాగా నిబంధనలు మారాయని అంటూ మరోసారి అటవీశాఖ కొత్త మెలిక పెట్టింది. కొత్తచట్టం ప్రకారం తమకు కేటాయించిన 23 ఎకరాలకు తోడుగా మరో 23 ఎకరాలు కేటాయిస్తేనే అనుమతులు జారీ చేస్తామంటూ స్పష్టం చేసింది. దీంతో మళ్లీ కథ మొదటికి వచ్చినట్లయింది. అటవీశాఖ కోరుకున్న విధంగా అదనంగా 23 ఎకరాల స్థలం సేకరించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉంటుంది. అటు అటవీశాఖ, విద్యుత్‌శాఖ ఇటు రెవెన్యూశాఖల మధ్య సమన్వయం లోపించడంతో అదనపు స్థలం కేటాయింపు వ్యవహారమే కాకుండా విద్యుత్ సౌకర్యం అందించే విషయమై ప్రతిబంధకాలు ఏర్పడుతున్నాయి.

కాంగ్రెస్ సర్కార్ కరుణించాలంటూ వేడుకోలు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తున్న కాంగ్రెస్ సర్కార్ తమ గ్రామాలకు కరెంటు సౌకర్యం కల్పించాలంటూ కడెం, పెంబి మండలంలోని 16 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా అటవీశాఖ అనుమతులు ఎలాగైనా సాధించాలని వారంతా వేడుకుంటున్నారు. అటవీశాఖ కోరుతున్న విధంగా ఎక్కడైనా అదనంగా స్థలం కేటాయించాలని ఆ గ్రామాల ప్రజలు సూచిస్తున్నారు. తామంతా ఏళ్ల నుంచి కరెంటు సౌకర్యం కోసం ఆందోళనలు చేస్తున్నప్పటికీ అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని కాంగ్రెస్ సర్కార్ తమ గోడును పరిష్కరించాలని పెంబి, కడెం మండలంలోని 16 గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కరెంటు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



మారుమూల గ్రామమైన మా సోము గూడ గ్రామంలో ఏళ్ల తరబడి కరెంటు సౌకర్యానికి మేము నోచుకోవడం లేదు. దీంతో నిత్యం చీకట్లోనే మమేకమై జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మా గ్రామానికి కరెంటు సౌకర్యం కల్పించాలని కోరుతున్నాం.

పెంద్రం జైతు (సోముగూడ)

కరెంటు సౌకర్యం కల్పించండి



మా గ్రామానికి కరెంటు సౌకర్యం లేక చీకట్లో అనేక ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి పూట పాములు గ్రామంలోకి వస్తే కనబడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా మాకు మాత్రం ఇంత వరకు కరెంటు లేదు. దయచేసి కరెంటు సౌకర్యం కల్పించాలి.

ఇస్రు (సోముగూడ)

బాసర మాస్టర్‌ప్లాన్‌పై ఎమ్మెల్యే సమీక్ష



ఎమ్మెల్యే రాంరావు పటేల్‌తో చర్చిస్తున్న ఆలయ ఈవో

బాసర, జూన్, 27 : బాసర సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌పై గురువారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ సమీక్షించారు. ఆలయ ఈవో విజయరామారావు, ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాఠక్ పిలిపించుకొని చర్చించారు. మొదటి విడతలో చేపట్టాల్సిన ముఖ్యమైన పనులు, వాటికి కావాల్సిన నిధుల గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో సుమారు రూ. 42 కోట్ల నిధులు ఇప్పటి ప్రభుత్వం వెనక్కి తీసుకున్న విషయం చర్చల్లో ప్రస్తావనకు వచ్చింది. రూ. 42 కోట్లు తిరిగి తెచ్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అంతేగాకుండా కేంద్ర ప్రభుత్వ ప్రసాదం పథకం కింద బాసర ఆలయ అభివృద్ధికి రూ. 50 కోట్లు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో జాప్యం జరిగితే అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి అవసమైన నిధులు ఇచ్చేందుకు దాతలు కూడా సిద్ధంగా ఉన్న విషయాన్ని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు.

ఆలయాల నిర్మాణాలపై ప్రత్యేకదృష్టి

భైంసా : నియోజకవర్గ పరిధిలో ఆలయాల నిర్మాణాలు చేపట్టే విషయమై ప్రత్యేకదృష్టి సారించినట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ పేర్కొన్నారు. గురువారం భైంసా పట్టణ పరిధిలో మార్కండేయ మందిర నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరి చేయించిన నేపథ్యంలో ఇక్కడి పద్మశాలి సంఘం ప్రతినిధులు భేటీ అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా భైంసా పట్టణ పద్మశాలి సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే రామరావ్ పాటిల్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఇందులో సంఘం ప్రతినిధులు కాశీరామ్, సాధుల కృష్ణదాస్, వెంకటేష్, శివకుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న అడవి పందుల పట్టివేత

భైంసా రూరల్, జూన్ 27 : మండలంలోని దేగాం గ్రామంలో బుధవారం రాత్రి వాహనాల తనిఖీలో ఫారెస్ట్ సిబ్బంది అక్రమంగా తరలిస్తున్న అడవి పందులు పట్టుకున్నారు. డ్రైవర్ దిలీష్‌కుమార్‌ను విచారించగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా నుంచి వచ్చి తెలంగాణ నుంచి ఇక్కడ పందులను అక్రమంగా రవాణా చేస్తూ ఉంటామని అటవీశాఖ అధికారులకు తెలిపారు. పట్టుబడ్డ దిలీష్ కుమార్‌ను కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి పట్టుకున్నామని, అడవి జంతువులను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తప్పవని ఎఫ్ఆర్‌వో రాథోడ్‌రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఇర్ఫాన్ ఉద్దీన్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు లెనిన్, హరిలత, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



లక్ష్మణచాంద, జూన్ 27 : మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన రైతు రాపెల్లి నవీన్ చెందిన గేదె మేతకు వెళ్లి వాగువద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ న్యూట్ల్‌వైరుకు తగిలి విద్యుదాఘాతానికి గురై గురువారం మృతి చెందింది.

లక్ష్మణచాందలో పర్యటించిన కూచాడి శ్రీహరిరావు

లక్ష్మణచాంద, జూన్ 27 : నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు గురువారం మండలంలో పర్యటించారు. వడ్యాల్, నర్సాపూర్, రాచాపూర్, పొట్టిపెల్లి, పార్‌పెల్లి గ్రామాలలో బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'పెద్దచెరువు కబ్జాకు గురికాకుండా చూడండి'

దస్తురాబాద్, జూన్ 27 : మండల కేంద్రంలోని పెద్దచెరువు కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరుతూ మండలంలోని గంగపుత్రులు గురువారం స్థానిక తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మండల కేంద్రంలోని చెరువులు, కుంటలు కబ్జాకు గురైతే తమ జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

భైంసా మున్సిపాలిటీలో తొలగిన డిజిటల్ కీ కష్టాలు



ధృవీకరణ పత్రాలను జారీ చేస్తున్న ఉద్యోగి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



డిజిటల్ కీ ఇదే..

భైంసా, జూన్ 27 : మున్సిపల్ కార్యాలయంలో నెల రోజులుగా డిజిటల్ కీ లేక పోవడం మూలంగా ధృవీకరణ పత్రాలు పొందే విషయంలో ఎదురవుతున్న కష్టాలు తొలగిపోయాయి. సంబంధిత సమస్యపై ఈ నెల 23న ఆంధ్రజ్యోతి జిల్లా టాబ్లాయిడ్‌లో మున్సిపాలిటీలో డిజిటల్ కీ కష్టాలు పేరిట ప్రచురితమైన వార్తకు అధికార యంత్రాంగం స్పందించింది. సమస్య ప్రాధాన్యతను గుర్తించింది. ఇందులో భాగంగానే మున్సిపల్ ఇన్‌చార్జీ కమీషనర్ సుదర్శన్ రెడ్డిని ఈ ముద్ర ద్వారా డిజిటల్ కీ కోసం దరఖాస్తు చేసుకునేలా ఆదేశించారు.దరఖాస్తు కోసం నెలకొన్న సమస్యలను పరిష్కరించారు. దీంతో రెండు రోజుల క్రితం ఇన్‌చార్జీ కమీషనర్ సుదర్శన్ రెడ్డి డిజిటల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గురువారం భైంసా మున్సిపల్ కార్యాలయానికి ఇన్‌చార్జీ కమీషనర్ సుదర్శన్ రెడ్డి సంతకంతో కూడిన డిజిటల్ కీ సరఫరా అయ్యింది. ఈ క్రమంలో మధ్యాహ్నం నుంచి నెల రోజులుగా పెండింగ్‌లోనున్న వివిధ ధృవీకరణ పత్రాల జారీ ప్రక్రియకు మున్సిపల్ అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. సమస్యను పరిష్కరింప చేసిన ఆంధ్రజ్యోతికి పలువురు అభినందించారు.

జిల్లాలో పలుచోట్ల కురిసిన వర్షం

అత్యధికంగా పెంబి మండలంలో 87.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఖానాపూర్, జూన్ 27 : జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు జిల్లాలోని పలు మండలాల్లో విస్తారంగా వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యధికంగా 87.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా బాసరలో అత్యల్పంగా 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 14.9 సగటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

పట్టువీడని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

- యూనియన్ ఏర్పాటుకు కొనసాగుతున్న యత్నాలు

బాసర, జూన్, 27: బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు విద్యార్థి సంఘం ఏర్పాటు కోసం (టీఎస్‌ఏ) ఏర్పాటు కోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే అధికారులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అనేక సార్లు కలిసి విన్నవించారు. అధికారుల నుంచి మాత్రం స్పందన రాకపోవడంతో ప్రతిరోజు కలుస్తూనే ఉన్నారు. యూనియన్ వద్దు సమస్యలు ఏవైనా ఉంటే చెప్పుకొండంటూ అధికారులు సూచిస్తున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయి అధికారులు సరైన ఫార్మెట్‌లో దరఖాస్తు ఇవ్వడం లేదంటూ క్షేత్రస్థాయి అధికారులు తమ సమావేశానికి అనుమతి ఇవ్వడం లేదని విద్యార్థులు పేర్కొన్నారు. అంతేకాదు యూనియన్ ఏర్పాటు చేస్తామని అడిగినప్పటి నుండి తమపై ఒత్తిడి పెరిగిందని చిన్న చిన్న కారణాలతో తరగతుల నుంచి వెనక్కి పంపిస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, జూన్ 27 : డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతితో పాటు జూలై 6న జయంతి పురస్కరించుకొని తలపెట్టిన కార్యక్రమాల్లో భాగంగా గురువారం నిర్మల్ మండలం తల్వేద గ్రామం బీజేపీ నూతన కార్యాలయంలో నాయకులు మొక్కలు నాటారు. జిల్లా అధ్యక్షుడు కే. అంజుకుమార్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్‌రెడ్డి, మేడిసెమ్మెరాజు, గాదె విలాస్, కమల్‌నయన్, సర్పంచ్ అనిల్, ఆడెప్ప సుధాకర్, పి. ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మా పై వస్తున్నవి ఆరోపణలు మాత్రమే : ఏఈ

మామడ, జూన్ 27 : మండలంలోని పరిమండల్ గ్రామ రైతులు విద్యుత్ అధికారులకు ఎటువంటి డబ్బులు అడగలేదు. వారి దగ్గర నుండి డబ్బులు తీసుకోలేమని విద్యుత్ ఏఈ బాలయ్య అన్నారు. టాన్స్‌ఫార్మర్ల కోసం డీడీలు తీసి ఇస్తే సాంక్షన్ చేయడం జరిగింది. ఎక్కువ కెపాసిటీ కావాలంటే అధిక డబ్బులు డీడీలు అవసరం దానికి డీడీలు చెల్లిస్తే ఎస్టిమేట్స్ ప్రకారం అధిక లోడ్ టాన్స్‌ఫార్మర్లు బిగిస్తామన్నాము. కానీ రైతుల దగ్గర నుండి డబ్బులు తీసుకోలేమని ఇటువంటి తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ఆయన అన్నారు. రైతులను సంప్రదించగా మేము విద్యుత్ అధికారులకు ఎటువంటి డబ్బులు ఇవ్వలేమని, అధికలోడ్ విషయంలో అధిక డబ్బులు ఖర్చు అవుతాయని, ఎమ్మెల్యేని కలిసి సాంక్షన్ చేయమని వారి దృష్టికి తీసుకపోవడం జరిగిందని తెలిపారు. విద్యుత్ అధికారులు డబ్బులు అడగలేదన్నారు.

మహిళలు, చిన్న పిల్లల రక్షణకు పటిష్ఠచర్యలు : ఎస్పీ జానకి షర్మిల



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్స్ బృందం

నిర్మల్ కల్చరల్, జూన్ 27 : జిల్లాలో మహిళలు, చిన్న పిల్లల రక్షణకు పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని ఎస్పీ జానకి షర్మిల స్పష్టం చేశారు. గురువారం ఆల్ఫోర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కళాశాల నుండి విద్యార్థినులు బయటకు వెళ్లే సమయంలో షీ టీమ్ బృందాన్ని అక్కడకు పంపించి ఆకతాయిలను మందలించారు. ఈ సందర్భంగా వారికి అవగాహన కల్పించారు. ఆకయితాల వేధింపుల నుండి రక్షణ కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. విద్యార్థినులకు షీ టీమ్స్ ద్వారా అవగాహన కల్పిస్తూ నిరంతరం అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళలు, యువతులు, విద్యార్థులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా నేరుగా సంప్రదించాలని సూచించారు. షీ టీమ్ నెంబర్ 8712659550కు గాని డయల్ 100 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టి సేఫ్ యాప్ ఉపయోగించుకోవాలని సూచించారు.

స్వయం సహాయక సంఘాలను పరిశీలించిన కేంద్ర బృందం



సిర్గాపూర్‌లో మహిళలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

దిలావర్‌పూర్, జూన్ 27 : మండలంలోని ఐకేపీ స్వయం సహాయక సంఘాల పురోగతిని పరిశీలించేందుకు గురువారం మండలంలో కేంద్ర బృందం పర్యటించింది. కేంద్ర బృందం సభ్యులు ప్రొఫెసర్ రేవతి, గోవింద్ కెల్కర్‌లు సిర్గాపూర్, గుండంపల్లిలో స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యుల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఏ విధంగా ఆర్థికంగా అభివృద్ధి సాధించారో వారినే అడిగి సమాధానం రాబట్టారు. మహిళా సంఘాల సభ్యులు రుణాలు ఏవిధంగా సద్వినియోగం చేసుకుని ఆదాయం పెంపొందించుకుంటున్నారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా మెరుగైన ఆదాయం సంపాదించేందుకు ఏం చేయాలనే దానిపై మహిళలతో చర్చించారు. ఆ తర్వాత దిలావర్‌పూర్‌లో మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీని సందర్శించి కంపెనీ లాభనష్టాలపై ఆరా తీశారు. కందులు కొనుగోలు చేసి మార్కెటింగ్ చేయడం ద్వారా రూ.20 వేల లాభం వచ్చినట్లు మహిళలు వారికి వివరించారు. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో కంపెనీ ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సులోచనరెడ్డి, సీసీలు సాయన్న, పోశెట్టి, ముత్యం, గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలు, ఎఫ్‌పీసీ సీఈవో విశ్వనాథ్, అకౌంటెంట్ మహేష్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలి : జడ్పీ సీఈవో



నర్సరీని పరిశీలిస్తున్న సీఈవో

ముథోల్, జూన్ 27 : గ్రామ పంచాయతీలలో సెక్రటరీలు, సిబ్బంది పారిశుధ్యంపై ముందుగా ప్రత్యేక శ్రద్ధ పెట్టి సీజన్ వ్యాధులు రాకుండా చూడాలని జడ్పీ సీఈవో ఐ. గోవింద్ అన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయాన్ని సందర్శించి ముథోల్ నర్సరీని పరిశీలించారు. ముందుగా గ్రామ పంచాయతీ నర్సరీలో మొక్కలను పరిశీలించి పలు వివరాలు ఎంపీడీవో రాములు నాయక్‌కు ఈజీఎస్ సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. మండలంకు 97 వేల మొక్కలను అన్ని గ్రామ పంచాయతీల వారీగా ఇచ్చిన టార్గెట్‌ను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ ప్లాంట్‌లకు కంచె ఏర్పాటు చేయాలన్నారు. ఈ వర్షాకాలంలో సీజన్ వ్యాధులు రాకుండా సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు, కార్యదర్శులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీటి ట్యాంకులను నెలలో మూడుసార్లు క్లోరోనైజేషన్ చేయాలని, మురికి కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని, మురికి కాలువలు, గుంతలలో దోమల నివారణకై ఆయిల్ చుక్కలను వేయాలన్నారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాములు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.

ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పూర్తి చేయండి

ముథోల్, జూన్ 27 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణం పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ముథోల్‌లో గురువారం నిలిచిపోయిన ఆసుపత్రి నిర్మాణ పనులను మండల బీజేపీ అధ్యక్షులు కోరి పోతన్న ఆధ్వర్యంలో పరిశీలించారు. సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు సతీష్‌రెడ్డి, రవి కిరణ్‌గౌడ్, పోతన్న, ధర్మపురి సుదర్శన్, సాయినాథ్, తదితరులున్నారు.

'కలిసి కట్టుగా కళాశాలను అభివృద్ధి చేసుకుంటాం'

కుంటాల, జూన్, 27 : కుంటాలలో నూతనంగా ఏర్పాటైన జూనియర్ కళాశాలను గ్రామస్తులందరం ఐకమత్యంతో అభివృద్ధి చేసుకుంటామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం నూతన కమిటీని ఏర్పాటు చేసిన అనంతరం కళాశాల నిర్వాహణకు విరాళాలు సేకరించి సామాగ్రిని కొనుగోలు చేస్తామని, జూలై మొదటి వారంలో తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రస్తుతం తరగతులను ఉచితంగా బోధించడానికి అర్హత గల అభ్యర్థులు కొందరు ముందుకు వచ్చారని హాస్టల్ వసతికోసం ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి నిర్మల్‌లో జాతీయ సదస్సు

నిర్మల్ కల్చరల్, జూన్ 27 : నిర్మల్ డిగ్రీ కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయసదస్సు శుక్రవారం ప్రారంభం కానుంది. సదస్సు సమన్వయకర్త సరితారాణి, ప్రిన్సిపాల్ భీంరావు విడుదల చేసిన ప్రకటనలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆర్థిక సహాయంతో నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. కీ నోట్‌వక్తగా మానే గ్రూప్ సీఈవో బెంగళూరుకు చెందిన డాక్టర్ ఎల్. రాజేందర్‌రెడ్డి పాల్గొనున్నారు. సుస్థిర అభివృద్ధిలో రసాయన, అనుబంధ శాస్త్రాల పాత్ర అనే అంశంపై సదస్సు జరుగనుందన్నారు. ఇప్పటికే వివిధ యూనివర్సిటీల నుంచి 76 పరిశోధన పత్రాలు అందాయన్నారు.

'అతిథి అధ్యాపకులుగా దరఖాస్తు పంపండి'

నిర్మల్ డిగ్రీ కళాశాలలో పలు విభాగాల్లో పని చేసేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు అతిథి అధ్యాపక నియామకాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జే. భీంరావు ఒక ప్రకటనలో కోరారు. ఇంగ్లీష్, తెలుగు మీడియంలో జంతుశాస్త్ర 1, కంప్యూటర్ సైన్స్ 2, రాజనీతి శాస్త్రం 1, ప్రభుత్వ పాలన శాస్త్రం 1 పోస్టు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఉర్దూ మీడియంలో ఉర్దూ 1, చరిత్ర 1, జంతుశాస్త్రం 1, రసాయన శాస్త్రం 1 పోస్టులకు ఎంపిక చేస్తారన్నారు. సంబంధిత విషయాల్లో 55 శాతం తక్కువకాకుండా పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ 50 శాతం ఉంటే సరిపోతుందన్నారు. జూలై 3లోగా దరఖాస్తు చేయాలని 4న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

గ్రామపంచాయతీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

- ఫిర్యాదు చేసిన చాక్‌పల్లి జీపీ సెక్రెటరీ



నర్సాపూర్(జి), జూన్ 27 : మండలంలోని చాక్‌పల్లి గ్రామ పంచాయతీ ప్రభుత్వ ట్రాక్టర్ బ్యాటరీ గుర్తు తెలియని దొంగలు ఎత్తుకుపోయినట్లు పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మధ్యాహ్నం చాక్‌పల్లి గ్రామ పంచాయతీ ముందుర ట్రాక్టర్ నిలిపిఉంచి.. గురువారం ఉదయం వచ్చిచూడగా ట్రాక్టర్ బ్యాటరీ కనబడకపోవడంతో గ్రామ పంచాయతీ సెక్రెటరీ నరేష్‌కుమార్ గుర్తు తెలియని దొంగలు అపహరించినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు.

'తవ్విన కందకాలను వెంటనే పూడ్చండి'

ఖానాపూర్, జూన్ 27 : ఖానాపూర్ నుండి తర్లపాడ్ వైపు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా తవ్విన కందకాలను వెంటనే పూడ్చాలని తహసీల్దార్ శివరాజ్ సూచించారు. గురువారం స్థానిక ఆర్ అండ్ బి డీఈ మల్లారెడ్డితో కలిసి ఆయన రోడ్డుకు ఇరువైపులా చేయబడిన తవ్వకాలను పరిశీలించారు. వెంటనే సంబంధిత కందకాలు తవ్విన వ్యక్తిని పిలిచి వాటిని తక్షణమే పూడ్చేయాలని ఆదేశించారు. ఇష్టారీతిన కందకాలు తవ్వడం ద్వారా వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే కందకాలను పూడ్చకపోతే చట్టపరమైన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.






కోపర్గడ్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


సాలెవాడలో వాటర్ డ్రమ్ములు పరిశీలిస్తున్న డాక్టర్ సందీప్

అంటు వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

● శ్యాంపూర్ పీహెచ్‌సీ డాక్టర్ రాథోడ్ సందీప్‌కుమార్

ఉట్నూర్, జూన్ 27: వర్షాకాలం ప్రబలనున్న అంటు వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటే సరిపోతుందని శ్యాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాథోడ్ సందీప్‌కుమార్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలంలోని సాలెవాడ, కోపర్‌గడ్ గ్రామాలలో పర్యటించి ముందుగా కోపర్గాడ్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలు కొందరు మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నట్లు తెలపడంతో అందులో 64 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించామన్నారు. మరో 13 మంది మందికి రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. అదేకాకుండా సాలెవాడ గ్రామంలో ఇంటింటా డ్రై డే నిర్వహించామన్నారు. ఇళ్ల పరిసరాలను ప్రజలందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇళ్ల ముందు మురికినీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, ఇళ్లలో నీటి నిల్వ పాత్రలను ప్రతీ వారినికి ఒకసారి పరిశుభ్రం చేసుకోవాలని లేనట్లయితే నీటి నిల్వ పాత్రలలో తోక పురుగులు పెరిగి డెంగ్యూ దోమలు వృతి చెంది అవకాశాలు మె ండుగా ఉంటాయని, ఈ దోమలు పగటిపూట కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరాలు ప్రభలుతాయని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలలో వైద్య సిబ్బంది జిలాని, రాథోడ్‌శ్రీరామ్, వసంతరావు, సజన్, సునిల్, సరస్వతి, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మాజీ సర్పంచ్‌లు మాణిక్‌రావు, తులసిరామ్, నానక్రాం, ప్రేమ్‌సింగ్, గ్రామస్థులు హాజరయ్యారు.

నగల దుకాణంలో చోరీ

● యజమానిని మాటల్లో పెట్టి బంగారం ఎత్తుకెళ్లిన యువకుడు ● చుట్టూ ప్రజలు.. అంతలోనే బంగారం మాయం


ఇచ్చోడలో దొంగతనం జరిగిన లక్ష్మీనారాయణ జూవెల్లర్స్ (ఇన్‌సెట్‌లో దొంగతనం చేస్తూ సీసీ కామెరాకు చిక్కిన యువకుడు)

ఇచ్చోడ, జూన్, 27: నగల దుకాణ యజమానిని మాటల్లో పెట్టి బంగారుపెట్టెలో నుంచి రెండు తులాల విలువ గల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన సంఘటన ఇచ్చోడ మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు, దుకాణ యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. బంగారంతో తయారు చేసిన ఓం లాకెట్ కావాలని గుర్తుతెలియని యువకుడు లక్ష్మీనారాయణ జూవెల్లర్స్ దుకాణానికి రావడం జరిగింది. ఇలాంటిది కాకుండా మరో రకమైన మోడల్ చూపించమని అడిగేసరికి దుకాణ యాజమాని చూపిస్తూ ఉండగానే యువకుడు నగలను దొంగలించి ప్యాంట్ ప్యాకెట్‌లో దాచి రూ. వెయ్యి నగదును అడ్వాన్స్‌గా ఇవ్వడం జరిగింది. యజమాని రశీదు ఇస్తానని చెప్తున్నప్పటికీ.. మా అక్కను తీసుకొస్తానని అక్కడి నుంచి హుడాయించాడు. దీంతో బంగారు అభరణాలు కనిపించక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాల ఆధారంగా యువకుడి ముఖచిత్రాన్ని, ద్విచక్రవాహనంపై ఇద్దరు వెళ్లే చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

బాలుడిపై అత్యాచారం చేసిన నిందితుడికి 20 ఏళ్ల జైలు

ఆదిలాబాద్, జూన్27 (ఆంధ్రజ్యోతి): బాలుడిపై అత్యాచారం చేసిన నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ ఫోక్సో కోర్టు న్యాయాధికారి డా.పి.శివరాం ప్రసాద్ గురువారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. జూన్2, 2021న నేరడిగొండ మండలంలో ఎనిమిదేళ్ల బాలుడు అక్కతో ఇంటిలో మట్టి పని చేస్తుండగా.. సమీప బంధువైన శివరాత్రి మహేశ్(30) అనే వ్యక్తి కిరాణా షాపుకు వెళ్లాలని బాలుడిని తన ఇంటికి తీసుకు వెళ్లాడు. చాలా సేపు అవుతున్న తన తమ్ముడు తిరిగి రాకపోవడంతో బాలుడి అక్క మహేశ్ ఇంటికి వెళ్లి చూడగా.. అసహజ పద్ధతిలో లైంగిక వాంఛ తీర్చుకున్న విషయాన్ని చూసి కుటుంబ సభ్యులకు తెలిపింది. విషయం తెలుసుకున్న నిందితుడు పరారయ్యాడు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి నేరడిగొండ ఎస్సై భరత్‌సుమన్ సెక్షన్ 377 ఐపీసీ, ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి బాధితుడిని రిమ్స్ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కేసులో అప్పటి డీఎస్పీ ఎస్.ఉదయ్‌రెడ్డి విచారణ జరిపి సాక్ష్యలను సేకరించి చార్జీషీటు దాఖలు చేయగా.. ప్రత్యేక పీపీ ఎస్.రమణారెడ్డి 11 మంది సాక్షులను విచారించి కేసు రుజువు చేశారు. దీంతో గురువారం ఆదిలాబాద్ ఫోక్సో కోర్టు న్యాయాధికారి డా.పి.శివరాం ప్రసాద్ తీర్పు వెలువరించారు. నిందితుడు మహేశ్‌కు 20సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. అలాగే బాధితుడికి రూ.5లక్షల నష్టపరిహారం అందించాలని న్యాయ సేవ అధికార సంస్థను న్యాయాధికారి ఆదేశించారని లైజన్ అధికారి పండరి తెలిపారు.

'అటవీ భూ అక్రమణలపై పీడీ యాక్టు'

ఇచ్చోడ, జూన్ 27: ఇచ్చోడ మండలంలోని బాబ్జిపేట్ పరిధిలో అక్రమణకు గురైన అటవీ ప్రాంతాల్లో అటవి శాఖ ఉన్నతాధికారులు గురువారం పర్యటించారు. దాదాపు 3920 ఎకరాల భూమిని అక్రమించినట్లు వారు పేర్కొన్నారు. శుక్రవారం నుంచి యధావిధిగా మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అటవి భూ అక్రమణకు పాల్పడిన, స్మగ్లింగ్ కార్యక్రమాలు చేసిన వారి పైన పీడీ యాక్టు ప్రయోగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో ఐఎఫ్ఎస్ ఎఫ్డీపీటీ శాంతరామ్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్‌బాజీరావు పాటిల్, ఎఫ్ఆర్‌వో గణేష్, ఇచ్చోడ సీఐ భీమేష్, ఉప అటవి క్షేత్రాధికారి గిరయ్య, ఎస్సైలు శ్రీకాంత్, ఇమ్రాన్, ఎఫ్ఎస్‌వోలు వసంత్‌కుమార్, సరిత్ర, శ్రీకాంత్, రిజర్వు పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యాక్సిడెంట్ కేసులో ఇద్దరికి జైలు

ఇచ్చోడ, జూన్, 27: లైసెన్స్ లేకుండా ఆటోను అజాగ్రత్తగా నడపడంతో అడెగామకు చెందిన నల్లతీగల కొండన్న మృతి చెందిన కేసులో ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు, రూ.2వేల జరిమానా విధించినట్లు బోథ్ కోర్టు ప్రథమ శ్రేణి న్యాయాధికారి హుస్సేన్ పూర్తి విచారణ చేపట్టి నేరం రుజువు కావడంతో డ్రైవర్ చౌహాన్ శ్రీనివాస్ అనే వ్యక్తికి శిక్ష విధించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. లైసెన్స్ లేని వారికి ఆటోను ఇచ్చినందుకు ఆటో ఓనర్ సీతారాంకు మూడు నెలల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

చైన్ స్నాచింగ్ దొంగల అరెస్టు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 27: ఇటీవల తాంసి, బేల పోలీస్ స్టేషన్‌ల పరిధిలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి కేసు వివరాలను గురువారం వెల్లడించారు. చైన్ స్నాచింగ్ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి దొంగలించిన ఆభరణాలతో పాటు ఒక బైక్, నాలుగు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆదిలాబాద్‌లో భారీగా గుట్కా పట్టివేత

ఆదిలాబాద్ రూరల్, జూన్ 27: ఆదిలాబాద్‌లోని భుక్తాపూర్ కరణ్ ట్రేడర్స్ షాపులో గురువారం పోలలీసులు సోదాలు నిర్వహించారు. రూ. 2.10 లక్షల విలువైన నిషేధిత గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎస్సై హబీబాఖాన్ తెలిపారు. స్థానిక అస్లాం ట్రేడర్స్ నుంచి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో షేక్ అఫ్సర్, షేక్ ఇష్తేఖార్, షేక్ సల్మాన్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.




విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ప్రభుత్వ పాఠశాలల్లో డీఈవో తనిఖీలు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 27: జిల్లా విద్యాధికారి ప్రణీత ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, తంతోలి పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు తీరు, బడిబాట కార్యక్రమం, యూనిఫామ్స్, పుస్తకాల పంపిణీ వివరాలను ప్రధానోపాధ్యాయులు అడిగి తెలుసుకున్నారు. పిల్లల పఠన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సెక్టరల్ అధికారి సుజాత్ ఖాన్, సీసీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన మాజీ ఎంపీ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 27: మాజీ ఎంపీ సోయం బాపురావు గురువారం కేంద్ర మంత్రులను కలిశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఉయికే దుర్గాదాస్‌లను మాజీ ఎంపీ సోయంబాపురావ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఆదివాసీ ఉద్యమంలో దుర్గాదాస్‌తో ఆయనకు ఉన్న అనుబంధం గురించి చర్చించుకున్నారు. ఆదివాసీ హక్కులు, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గిరిజనశాఖ మంత్రి దుర్గాదాస్‌కు సోయం కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అదేవిధంగా పార్టీ కోసం పని చేయాలని బండి సంజయ్ సూచించారని మాజీ ఎంపీ పేర్కొన్నారు.

'రిజిస్ట్రేషన్లను నిలిపి వేయాలి'

ఆదిలాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): మావల మండలం బట్టిసావర్గాం శివారులో సర్వే నెం.72/3లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను వెంటనే నిలిపి వేయాలంటూ ఏఐటీయూసీ నాయకులు గురువారం కలెక్టర్ రాజార్షిషాకు వినతిపత్రాన్ని అందజేశారు. సర్వే నెం.72/3లో అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై ఆదిలాబాద్ సబ్‌రిజిస్ట్రార్ అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇందులో జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రదేవేందర్, రాథోడ్‌నరేందర్, తదితరులున్నారు.

'ప్రయాణికుల భద్రత కోసం యాప్'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 27: ఆర్టీసీ సురక్షిత ప్రయాణంతో పాటు భద్రత కల్పించేలా గమ్యం యాప్ అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆర్ఎం సోలోమాన్ అన్నారు. ఆర్టీసీ సేవలు, గమ్యం యాప్ పై తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులకు సేవల గురించి తెలియజేస్తూ గమ్యం యాప్ లాభాలను వివరించారు. ఇందులో డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్, డీఎం కల్పన, కళాకారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నులిపురుగుల నుంచి సంరక్షించాలి'

నేరడిగొండ, జూన్ 27: పిల్లలను నులిపురుగుల నుంచి సంరక్షించాల్సిన బాధ్యత పోషకులపై ఉందని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం హెచ్‌ఈవో హరీకుమార్‌గౌడ్ అన్నారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రెయిన్‌బో, సెంట్‌మేరీ, శిశు మందిర్, శ్రీసేవా పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు చిన్నారులకు వేయాలన్నారు. దీంతో పిల్లలో ఎదుగుదల లోపం సమస్యతీ రుతుందని పేర్కొన్నారు. అలాగే పోషకాహార లోపం, రక్తహీనత, తదతర సమస్యలు లేకుండా ఉంటాయని తెలిపారు. ఆరోగ్యకరంగా ఉండాలంటే ఈ నులిపురుగుల మాత్రలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ రామ్‌నరేష్ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

'ఉడుములను చంపితే ఏడు నెలల జైలు'

బోథ్, జూన్ 27 : వర్షాకాలంలో జల్లులకు వాటి నివాస స్థలాల నుంచి బయటకు వస్తాయని వాటిని వేటాడతే ఏడు సంవత్సరాలు జైలు శిక్ష రూ.50 వేల జరిమానా ఉంటుందని బోథ్ రేంజ్ అధికారి ప్రణయ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉడుములను వేటాడుతున్నట్లు సమాచారం అందుతుందని, దొరికితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన ఉంటుందన్నారు. ఎవరైనా ఉడుములను వేటాడినట్లు సమాచారం ఇస్తే బాధ్యులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎఫ్ఆర్‌వో తెలిపారు.

'పంటల సాగుపై జాగ్రత్తలు తీసుకోవాలి'

బోథ్, జూన్ 27: వర్షాకాలం సాగు చేసే పంటలపై అప్రమత్తంగా ఉండాలని ఏఈవో శ్యామ్‌సుందర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మరలపెల్లి గ్రామంలో పొలాల్లోకి వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. కలుపు మొక్కల నివారణపై శ్రద్ధ వహించాలన్నారు. వివిధ రకాల చీడ పీడలు ఆశించే ఆస్కారం ఉందని, పిచికారి చేయాలని సూచించారు.



● సోనాల సమీపంలో కోతకు గురై ప్రమాదకరంగా మారిన రోడ్డును పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



● ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ నుంచి గిన్నెర గ్రామానికి వెళ్లే రోడ్డు పరిస్థితి ఇలా..

దారులు.. దారుణం!

- జిల్లాలో అధ్వానంగా తయారైన గ్రామీణ రహదారులు
- వర్షాలకు కోతకు గురై ఏడాదైనా మరమ్మతుల కరువు
- అడుగడుగునా భారీ గుంతలు.. ప్రమాదకరంగా ప్రయాణం
- నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్న అధికారులు
- వర్షాకాలం సీజన్ మొదలైనా.. కదలని యంత్రాంగం



ఆదిలాబాద్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. గతేడు కురిసిన భారీ వర్షాలు, వరదలకు పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు కోతకు గురై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో పల్లె ప్రయాణం ప్రమాదకరంగా మారింది. చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ తారు మారవుతూ నాణ్యత నగుబాటుగా మారింది. జిల్లాలో రోడ్లు భవనాల శాఖ, పం చాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులను చేపడుతు న్నా.. మున్నాళ్ల ముచ్చటగానే మారింవది. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ తొలకరి వర్షాలకే అతుకులబొంతగా మారాయి. అత్యవసర సమయంలో ప్రయాణం చేయడానికి పడరాని పాట్లు పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. జిల్లాలో ముఖ్యంగా ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, బోథ్, తలమడుగు, భీంపూర్ మండలాల్లో అతుకులబొంతగా మారిన రోడ్లతో ప్రయాణికులు జంకుతున్నారు. గురువారం సోనాల గ్రామ సమీపంలో ప్రమాదకరంగా మారిన రోడ్ల పరిస్థితిని పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాద వ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాదైనా ఎక్కడా మరమ్మతులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. చిన్నపాటి మరమ్మతులు చేపడితే ప్రయాణ కష్టాలు దూరమవుతాయని చెబుతున్నారు. ఇప్పటి వరకు కొన్ని రోడ్ల కు మాత్రమే మరమ్మతులు చేపట్టి మిగితా రోడ్లను గాలికి వదిలేశారు. మళ్లీ వానాకాలం సీజన్ మొదలు కావడంతో గుంతలు ఏర్పడి ప్రయాణం ప్రమాదకరంగా మారిందని గ్రామీణ ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.



డేంజర్ స్పాట్స్

భారీ వర్షాలు, వరదల కారణంగా రోడ్లు ప్రమాదకరంగా మారినా.. అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు డేంజర్‌గా మారి కనిపిస్తున్నాయి. ప్రమాదకర ప్రాంతాలలో కనీసం హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఏదైనా జరుగకూడని ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరన్న ప్రశ్నలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే కొంత వరకైనా ప్రమాదాలను అరికట్టవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. పదికాలాల పాటు పదిలంగా ఉండాల్సిన రోడ్ల నిర్మాణ పనులు.. మూన్నాళ్ల ముచ్చటగానే మారాయంటున్నారు. జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి నేలలే కావడంతో రోడ్ల నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ గుంతలుపడి అతుకులబొంతగా మారాయి. కొన్ని గ్రామాలకు వెళ్లే దారులైతే అడుగు తీసి అడుగు వేసే పరిస్థితులు లేవంటున్నారు. రోడ్లపై రోజుల తరబడి వర్షపు నీరు నిలుస్తున్నా.. అధికారులకు పట్టింపే లేకుండా పోయింది. నిలిచిన వర్షపు నీటిని వెంటనే కిందికి జారిపోయే విధంగా రోడ్లను నిర్మించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ తారు రోడ్లపై కేజీవీల్ వాహనాలు, పరిమితికి మించిన భారీ వాహనాలను నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఏటా రోడ్ల నిర్మాణం చేపట్టడం, వర్షాకాలంలో గుంతలు పడడంతో మళ్లీ మరమ్మతులు చేసి బిల్లులు జేబులో వేసుకోవడం అధికారులు, కాంట్రాక్టర్లకు అలవాటుగానే మారిందంటున్నారు.

ప్రమాదమని తెలిసినా పట్టింపేది?

గతేడు వర్షాకాలంలో కోతకు గురైన రోడ్లు, కల్వర్టుల మరమ్మత్తుల కోసం నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన ఇప్పటి వరకు కదలిక కనిపించడం లేదంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలు గడుస్తున్న నిధులు మంజూరు కావడం లేదంటున్నారు. దీంతో చేసేది ఏమీ లేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. నిధులు లేవన్న కారణంగా ప్రమాదకరంగా మారిన రోడ్లను పట్టించుకోవడం లేదు. రోడ్డు పనులు పూర్తయిన తర్వాత కొన్నాళ్ల పాటు రోడ్ల నిర్వహణ బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌దే ఉంటుంది. కానీ అడిగే వారే లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వర్షాకాలం సీజన్‌కు ముందస్తుగా మరమ్మతులు చేపట్టి ఉంటే కొంత మేరకు ఇబ్బందులు తప్పేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మళ్లీ వర్షకాలం రావడంతో అధికారులు హడావుడి చేస్తున్నా.. ప్రయోజనమే లేకుండా పోతుంది. రోడ్ల నాణ్యత పై రిపోర్టులు ఇస్తున్నా.. ఏడాది తిరుగక ముందే గుంతలు పడి రోడ్లన్నీ అధ్వానంగా మారడం ఏమిటో అధికారులకే తెలియాలి మరి అంటున్నారు. ఒకవేళ నాణ్యత లేదని తెలిసినా.. ఆ వెంటనే గుట్టు చప్పుడుకాకుండా కాంట్రాక్టర్లు అధికారులను మేనేజ్ చేస్తూ.. బిల్లులను జేబులో వేసుకుంటున్నట్లు తెలుస్తుంది. నాణ్యత లేకుండా పనులు చేస్తే సదరు కాంట్రాక్టర్ నుంచి నిధులను రికవరీ చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అలాంటి పరిస్థితి జిల్లాలో ఎక్కడా కనిపించడం లేదు. ఇదంతా అధికారుల కనుసన్నల్లో కొనసాగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. యేటా కోట్ల రూపాయల నిధులు నేలపాలవుతున్నాయి.

త్వరలోనే మరమ్మతులు చేపడతాం..

: శివరాం, ఈఈ, పీఆర్

గతేడు వర్షాల కారణంగా కోతకు గురైన రోడ్లకు మరమ్మత్తులు చేపడుతాం. ఇప్పటికే కొన్నిచోట్ల పనులను చేపట్టడం జరిగింది. మళ్లీ వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో ప్రభుత్వానికి నివేదిక పంపించాం. త్వరలోనే నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. కొత్తగా నిర్మించిన రోడ్ల నిర్వహణ బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్లదే ఉంటుంది. ఇప్పటికే మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు సైతం ఇచ్చాం. వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

సంక్షిప్త సమాచారం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీవో

నేరడిగొండ, జూన్ 27: సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. గురువారం మండలంలోని లింగట్ల గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరు మరుగుదొడ్లను వినియోగించుకోవాలన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతీఒక్క కుటుంబం బయటకు వెళ్లకుండా మరుగుదొడ్లను వినియోగించుకో వాలని, దీంతో రోగాల భారీన పడకుండా ఉంటారని పేర్కొన్నారు. వర్షకాలంలో తాగునీటిని కాచివడబోసి తాగాలన్నారు. ఆయన వెంట ఎంపీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్థులు ఉన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, జూన్ 27: జిల్లాకేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లకు బేటీ బచావో బేటీ పడావో పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే సఖి కేంద్రం సేవలు, గృహ హింస చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో వనజ, సూపర్‌వైజర్ గౌరీ రాణి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలలను సీజ్ చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 27: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసే దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఇందులో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరీష్, గణేష్, తదితరులున్నారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం

● జిల్లా కలెక్టర్ రాజార్షిషా ● కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీసీ/డీఎల్ఆర్‌సీ సమావేశం ● పాల్గొన్న అన్ని బ్యాంకుల అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 27: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి డీసీసీ/డీఎల్ఆర్‌సీ సమావేశాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం జిల్లా లక్ష్యాలు, గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు సాధించిన విజయాల వివరాలను తెలిపారు. అనంతరం కలెక్టర్ వ్యక్తిగత బ్యాంకులు, శాఖల వారీగా సమీక్షించి బ్యాంకులకు ఇచ్చిన మహిళ శక్తి లక్ష్యాలను సాధించాలని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళ శక్తి పాలసీ కింద కొన్ని రకాల కార్యక్రమాలలో ప్రతీ మండలాల్లో లక్ష్యాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. దీనికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళ శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. మహిళ ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళ శక్తి ద్వారా 15రకాల కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. బ్యాంకుల నుంచి రుణాలు సకాలంలో అందించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ 2024-25 సంవత్సరానికి జిల్లా నూతన సంవత్సర వార్షిక రుణ ప్రణాళిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందులో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ప్రసాద్, నూతన ఎల్‌డీఎం ఉత్పల్‌కుమార్, ఏడీవో ఆర్‌బీఐ దేబోజిబారువా, డీడీఎం, నాబార్డు, పీడీ, డీఆర్‌డీఏ సాయన్న, ఈడీ ఎస్సీ కార్పొరేషన్, ఈడీ బీసీ కార్పొరేషన్, జీఎం, డీఐసీ, డాహో, డైరెక్టర్ విజయ డెయిరీ, జిల్లాలోని అన్ని బ్యాంకర్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపుకార్డులను అందజేస్తున్న కలెక్టర్

● ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డు

ఆదిలాబాద్ అర్బన్: జిల్లాలోని ట్రాన్స్ జెండర్‌లకు కలెక్టర్ రాజార్షిషా ట్రాన్స్‌జెండర్‌కార్డు, సర్టిఫికెట్ పంపిణీ చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌జెండర్స్ గుర్తింపు కార్డుల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా ట్రాన్స్‌జెండర్ సమాజంలో గుర్తింపు కోసం వారి హక్కుల పరిక్షణ కోసం ఐడీకార్డు, ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా మొత్తం ఎనిమిది మంది ట్రాన్స్‌జెండర్స్‌లకు పత్రాలు అందజేశారు.

ఇంద్రవెల్లి అమరుల స్తూపానికి పర్యాటక శోభ : ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, జూన్ 27: అన్ని హంగులతో ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపాన్ని పర్యాటక కేంద్రంగా అద్భుతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి, అదే విధంగా నాగోబా ఆలయ అభివృద్ధికి మరో రూ.కోటి మంజూరు చేసిందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ జిల్లా సార్మెడిలు, రగల్ జెండా కమిటీ, మేస్రం వంశీయులతో పాటు అధికారులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి విషయాలపై సుదీర్ఘంగా చర్చించి పెద్దల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి అమరవీరుల స్తూపంతో పాటు నాగోబా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. దీనిలో భాగంగా ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద పర్యాటకులను ఆకర్షించేందుకు అన్ని రకాల మొక్కలు, చెట్లను నాటడం జరుగుతుందన్నారు. స్థూపం చుట్టు ప్రహరీ ఏర్పాటు చేయడంతో పాటు నీటి సౌకర్యం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా నాగోబా ఆలయ అభివృద్ధికి కూడా ఒక కోటి రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. మేస్రం వంశీయులు, దేవదాయ శాఖ నాగోబా ఆలయంలో చేయవల్సిన పలు అభివృద్ధి పనులపై చర్చించి నివేదికలు తమకు అందజేస్తే.. త్వరలో పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాథోడ్‌భీమ్‌రావ్, సందీప్‌కుమార్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, జిల్లా మేడి మేస్రం దుర్గు, జిల్లా సార్మెడిలు, రగల్ జెండా కమిటీ, మేస్రం వంశీయులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే అనిల్

ఇచ్చోడ, జూన్, 27: ఇచ్చోడ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చోడ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రహదారి పనులు త్వరలోనే పూర్తవుతాయన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు వర్షాకాలంలో చిన్నపాటి ఇబ్బందులు తలెత్తుతాయని.. కొన్నిరోజులు ఓపిక పడితే ఆనందమైన అద్భుతమైన సిటీ మోడల్ లాంటి ప్రధాన రహదారి నిర్మాణం ఏర్పడుతుందన్నారు. వర్షాకాలంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న నాలాలాను శుభ్రపరిస్తే వరద నీరు రోడ్లపైకి, కాలనీలోకి రాకుండా ఉంటుందన్నారు. ఈ విషయమై అధికారులతో చర్చించి వరదనీటి సమస్యలను పరిష్కారిస్తానన్నారు. మండల నాయకులు, అధికారులు వర్షాకాలంలో కాలనీలు, రోడ్ల పరిస్థితులపై ప్రత్యేకశ్రద్ధ వహించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం మన బాధ్యత అని గుర్తుచేశారు. అనంతరం ఇచ్చోడ, సిరికొండ మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తుకారాం, ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఎనుగు కృష్ణారెడ్డి, నాయకులు జాహద్, సాబీర్, తదితరులున్నారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

● 'కొల్హారి వంతెన పనులను త్వరగా పూర్తి చేయండి'

బజార్‌హత్నూర్: మండలం పరిధిలోని కొల్హారి గ్రామం వద అంతర్ రాష్ట్ర రహదారిపై నిర్మిస్తున్న వంతెన మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసి వాహణదారులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌కు సూచించారు. గురువారం వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత మండలకేంద్రంలోని రైతు వేదికలో 52 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శంకర్, పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.